క్లుప్తంగా

28 నుంచి సమ్మర్ క్యాంపులు

కొల్లిపర: గ్రంథాలయ జిల్లా సంస్థ కార్యా దర్శి ఉత్తర్వుల మేరకు కొల్లిపర మండలంలో వివిధ గ్రామాలలో ఉన్న శాఖ గ్రంథాలయాలలో 40 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ కోచింగ్ క్లాస్ రూమ్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు గుడిబండివారిపాలెం శాఖా గ్రంథాలయ అధికారి బి.సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఈ నెల 28 నుంచి జూన్ ఆరో తేదీ వరకు గ్రంథాలయాలలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యార్థిని విద్యార్థులకు వివిధ అంశాలపై సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో స్పోకెన్ ఇంగ్లీష్ డ్రాయింగ్ విజ్ఞానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాలలోనే గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలన్నీ విద్యార్థులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కవిరాజు పార్కులోని వీజీకే భవన్‌లో జరగనుంది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ డాక్టర్ నోరి నారాయణమూర్తి 'భారతములో అర్జునుడు' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారు. సభ్యులు సకాలంలో హాజరుకావాలని అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రేపు శ్రీసరస్వతీ శిశు మందిర్ గ్రాడ్యుయేషన్ డే

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని కుమార్‌పంప్స్ కాలనీలో గల శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల గ్రాడ్యుయేషన్ డే ఈనెల 28వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయే సభకు పాఠశాల సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహిస్తారు. 'నాసా' మాజీ శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, కుమార్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, సరస్వతీ విద్యాపీఠం, విజయవాడ సమితి సభ్యుడు సన్నిధి వెంకటసుబ్బారావు, పాఠశాల సంచాలిత సమితి కార్యదర్శి కోడూరు రమాదేవి, విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, కోశాధికారి డాక్టర్ అవ్వారు లత పాల్గొంటారని శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధం

తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని కోపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నల్లూరి రామకృష్ణ రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. పొలంలో శనివారం ఉన్నట్టుండి మంటలు చెలరేగి పంట దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లి మంటలను అదుపు చేశారు. రూ. 1.50 లక్షల నష్టం సంభవించి ఉంటుందని చెప్పారు.

వేసవి శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

తెనాలిటౌన్: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖాగ్రంథాలయం రికార్డు అసిస్టెంట్ ఎస్.లావణ్య శనివారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు నుంచి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ నెల28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందని అన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, స్టోరీస్ రీడింగ్, గ్రంథ పఠనం, పేపరు క్రాఫ్ట్ వంటివి ఉచితంగా నేర్పించబడతాయని చెప్పారు.

గడ్డివామి దగ్ధం

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): గడ్డివామి దగ్ధమైన సంఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని కోడూరులో శనివారం చోటు చేసుకుంది. వీఆర్వో నాగాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలోని షేక్ సలాంకు చెందిన ఐదు ఎకరాల వరి గడ్డి వామి కాలిపోయిందని తెలిపారు. పొన్నూరు నుంచి ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారని చెప్పారు. రూ. 50 వేల విలువైన గడ్డి కాలిపోయిందని ఆయన పేర్కొన్నారు.

నేడు సుదర్శన హోమం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం సుదర్శన హోమాన్ని నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైత్ర అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నామని చెప్పారు. పాల్గొనే భక్తులు వైదిక వేషధారణలో ఉదయం 8.30 గంటలకు ఆలయానికి చేరుకోవాలని సూచించారు. హోమమునకు ఆవునెయ్యి, సమిధలు, పెసర్లు, వరి పేలాలు, నువ్వులు, తెల్ల ఆవాలు భక్తులు సమర్పించుకోవచ్చని ఓ ప్రకటనలో తెలిపారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలి

మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు

తెనాలిటౌన్: విద్యాహక్కు చట్టం అనుసరించి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న బలహీన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పేదరికం చదువుకు ఆటకం కాకూడదన్నా ప్రభుత్వ లక్ష్యాన్ని అనుసరించి ఇందుకోసం కనీసం 25 శాతం సీట్లు బలహీనవర్గాల పిల్లల కోసం కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. 2025-26 విద్యాసంవత్సరంలో సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో 1వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంధులు, హెచ్ఐవీ బాధితులు, ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీ వర్గాలు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వారైతే రూ.1,20,000 వార్షిక ఆదాయం మించకూడదని, పట్టణ ప్రాంతంలో రూ.1,44,000లు కలిగి ఉండాలని తెలిపారు.

సీబీఎస్‌ఈ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలంటే 2 ఏప్రిల్ 2019 నుండి 31 మార్చి 2020 మధ్య జన్మించి ఉండాలని, ఐదు సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో దరఖాస్తు కోసం 2 ఏప్రిల్ 2019 నుంచి 31 మే 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. తల్లిదండ్రులు తగిన ఆధారాలను సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా, సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవ ఇంటర్నెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఏప్రిల్ 28 నుంచి మే 15 మధ్య ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

తల్లులచే ప్రభుత్వ బడి బాట ప్రతిజ్ఞ

తెనాలి: బడి ఈడు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలంటూ సీనియర్ ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య చేపట్టిన ప్రచార కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో శనివారం చిన్నారుల తల్లిదండ్రులచే 'ప్రభుత్వ బడి బాట' ప్రతిజ్ఞ చేయించారు. రాబోయే జూన్‌లో ఆరంభమయే విద్యాసంవత్సరంలో 5-14 సంవత్సరాల వయసు కలిగిన బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని, రోజూ బడికి పంపిస్తామని తల్లులు ప్రతిజ్ఞ చేశారు. అంతేకాకుండా పాఠశాలల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తప్పకుండా హాజరౌతామని, విద్యాసంవత్సరం మధ్యలో పిల్లలను బడి మాన్పించమని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తామని కూడా ప్రతిజ్ఞలో వెల్లడించారు. చుండూరు మండల గ్రామం వేటపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బట్టు వెంకయ్య ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదవాలి, తల్లిదండ్రులు ఇందుకు మద్దతునివ్వాలని కోరుతూ 90 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడిలో ఈ కార్యక్రమం చేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు

కమిషనర్ బండి శేషన్న

తెనాలిటౌన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి సులభతరమైన భవన నిర్మాణ అనుమతులు అందుబాటులోకి వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవోఎంఎస్ నెం.20, తేది.04-02-2025 ద్వారా స్వీయ ధృవీకరణ పథకం 2025లో భాగంగా అంగీకారపత్రం సమర్పించి సులభంగా నిర్మాణ అనుమతులు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యాలయం ద్వారా లైసెన్స్ పొందబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్, సర్వేయర్లు, ఇంజనీర్ల ద్వారా అప్రూవల్ అయిన ప్రాంతాల్లో నివాసం కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా ఆసక్తి గల అర్హులైన ఐటీఐ సివిల్,డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ అభ్యర్థులు పురపాలక సంఘ కార్యాలయానికి నేరుగా కానీ, ఏపీఓబీపీఎస్ పోర్టల్‌ద్వారా లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ఇంజనీర్‌ల లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకుని లైసెన్స్ పొందవలసినదిగా కోరారు. నూతన ఎల్‌టీపీ లైసెన్స్‌ల కోసం, భవన నిర్మాణ అనుమతులకు కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ 9849907952 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

రాజేష్‌ను జనసేన నుంచి బహిష్కరించాలి

జై భీమ్‌రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాంజీ

రేపల్లె రూరల్: దళితుడిపై దాడికి పాల్పడిన జనసేన నాయకుడు రాజేష్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలని జై భీమ్‌రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొవా రమేష్ రాంజీ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేమూరు నియోజకవర్గం చావాలి గ్రామానికి చెందిన దళితుడు పోతుల కొండయ్యను ఇటీవల వేమూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఉపా రాజేష్ బహిరంగంగా కులం పేరుతో దూషించి చెప్పుతో దాడి చేసి గాయపరిచారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను బినామీ పేర్లతో రాజేష్ దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమానికి సహకరించని కొండయ్యను బహిరంగంగా దూషించి, దాడి చేశారని చెప్పారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయినప్పటికీ రాజేష్‌పై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని తెలిపారు. జనసేన అధిష్టానానికి దళితులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాజేష్‌ను శాశ్వతంగా బహిష్కరించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రమేష్ రాంజీ హెచ్చరించారు. సమావేశంలో జై భీమ్ భారత్ రావు పార్టీ నాయకులు కర్ర బాబూరావు,పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ రాంజీ

తూతూమంత్రంగా సర్వ సభ్య సమావేశం

వేమూరు: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం తూతూమంత్రంగా నిర్వహించారు. కొన్ని శాఖల అధికారులు డుమ్మా కొట్టినా ఎంపీడీవో శ్రీమన్నారాయణ పట్టించుకోవడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. సాక్షాత్తూ ఎంపీపీ యల్లమాటి మోహనరావు గైర్హాజరయ్యారు. దీంతో వైఎస్ ఎంపీపీ షేక్ బాజీ అధ్యక్షతన సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించి ముగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు బయటకు వెళ్లరాదని సూచించారు. ఉదయం 11 గంటలకు కల్లా పనులు ముగించుకొని ఇంటిలో ఉండాలని, సాయంత్రం 4 గంటల తర్వాతే బయటకు రావాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అల్లూరు యోన, దాది రజనీకుమారి, ఈపూరు కుసుమ, బొల్లిముంత శివపార్వతి పాల్గొన్నారు.

చెడిపోయిన చేతి పంపులతో తాగునీటి ఇక్కట్లు

చుండూరు(వేమూరు): మండలంలోని పలు గ్రామాల్లో చేతి పంపులు మూలన పడటంతో వేసవిలో తాగునీరు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లిలో చేతి పంపు చెడిపోవడంతో దానికి ప్లాస్టిక్ కాగితం చుట్టి వదిలి వేశారు. దీంతో గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.



అనుమానాస్పదస్థితిలో భవన నిర్మాణ కార్మికుడి మృతి

రేపల్లె రూరల్: అనుమానాస్పదస్థితిలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 14వార్డు వడ్డెర కాలనీకి చెందిన ఓర్సు నాగరాజు (37)తాపీ పని చేస్తుంటాడు. రెండురోజుల నుంచి మద్యం తాగుతూ ఇంటికి కూడా వెళ్లడం లేదు. శనివారం ఉదయం ఏబీఆర్ డిగ్రీ కళాశాల వెనుకవైపు పొలాల్లో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డుకు మోక్షం ఎప్పుడో ?



వేమూరు: మండలంలో వేమూరు - బలిజేపల్లి- చావలి రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మరమ్మతులు కోసం ప్రొక్లెయిన్‌తో రోడ్డు మొత్తాన్ని తవ్వేశారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాళ్ల రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నడపడం కష్టంగా మారింది. ఇక పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు స్పందించి వెంటనే రోడ్డును వేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



తెనాలి: వేసవికాలం సందర్భంగా రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని సాయిబాబా గుడి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రంలో ప్రతి శనివారం ఉచిత మజ్జిగ పంపిణీలో భాగంగా రావినూతల శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేశారు. కనగాల శ్రీను, అలపర్తి వెంకయ్య, రావినూతల వెంకటేశ్వరరావు, రావినూతల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 14 ఫిర్యాదులు



తెనాలిటౌన్: స్థానిక బస్టాండ్‌లోని ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చినట్లు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం అదనంగా కల్పించాలని, నూతన బస్సులు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా వీటిని పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేస్తామని వివరించారు. సంస్థ మనుగడకు ప్రయాణీకులు సహకరించాలని కోరారు. సురక్షితమైన ఆర్టీసీ ప్రయాణానికి ప్రాధన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మే 1 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా వేసవి ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. మే నెల ఒకటో తేదీ నుంచి 31వ తేదీవరకు నెలరోజులపాటు జరిగే శిబిరంలో యోగ, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, చిత్రలేఖనం, సంస్కృతం, తెలుగు భాషపై శిక్షణనిస్తారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటల్నుంచి 11.30 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరేళ్ల పైబడిన బాలికలు, స్త్రీలు, పదకొండేళ్ల లోపు బాలురకు మాత్రమే అవకాశమని వివరించారు. ఆసక్తి కలిగినవారు 99499 28425, 93478 32505 నంబర్లకు ఫోను చేసి రిజిస్ట్రేషను చేసుకోవాలని సూచించారు.

పరస్పర కేసులు నమోదు

వేమూరు: రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు కొట్టుకోవడంతో పరస్పర కేసులు నమోదు చేసినట్లు సీఐ రామాంజనేయులు వెల్లడించారు. జంపని గ్రామానికి చెందిన మన్నె శివయ్య అదే గ్రామానికి చెందిన మన్నె వెంకట కృష్ణను ట్రాక్టర్ డ్రైవరుగా పెట్టుకున్నాడు. అతడికి రూ. 30 వేలను అదనంగా ఇచ్చాడు. ట్రాక్టర్ డ్రైవర్ సక్రమంగా రాక పోవడంతో శివయ్య, అదే గ్రామంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. దీంతో వెంకట కృష్ణ ఆ ట్రాక్టర్ డ్రైవర్ వద్దకు వెళ్లి నిలదీశాడు. దీన్ని అతడు శివయ్యకు చెప్పాడు. దీంతో అతడు, మరి కొందరు వ్యక్తులు వెంకట కృష్ణ ఇంటికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వక పోవడంతో ఇంటి దగ్గరున్న ద్విచక్ర వాహనాన్ని తెచ్చారు. తర్వాత మన్నె వెంకట కృష్ణ, శివయ్య ఇంటికి వద్ద ఉన్న ట్రాక్టర్‌ను తీసుకొచ్చాడు. దీంతో శివయ్య కొంతమంది వ్యక్తులు కలిసి వెంకట కృష్ణను కొట్టారు. ఈ ఘర్షణలో శివయ్య వర్గం కూడా గాయపడింది. దీంతో రెండు వర్గాలు తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాయి. అనంతరం ఆసుపత్రి అవుట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామాంజనేయులు తెలిపారు.

కరణం ధర్మారావుకు ఘననివాళి

తెనాలి: రూరల్ మండల గ్రామం కఠెవరం గ్రామంలో ఇటీవల మృతిచెందిన వ్యాపార ప్రముఖుడు కరణం ధర్మారావుకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లు నివాళి అర్పించారు. శనివారం కఠెవరంలోని ధర్మారావు స్వగృహానికి వెళ్లి, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుమారులు కరణం వెంకటేశ్వరరావు, కరణం చంద్రశేఖర్‌కు తమ సానుభూతిని తెలియజేశారు.



నివాళి అర్పించిన మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి

బిషప్ జాన్‌పాల్‌కు గౌరవ డాక్టరేట్



తెనాలిరూరల్: తెనాలి మారిస్ పేటలోని రాక్ గాస్పెల్ చర్చి సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రెడిటేషన్ సంస్థ గుర్తింపు పొందిన బెంగళూరులోని న్యూ విజ్డమ్ బైబిల్ కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయనకు కళాశాల యాజమాన్యం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఫేవర్ ది హెల్ప్‌లెస్ మిషన్ పేరిట సేవా సంస్థను స్థాపించి మూడు దశాబ్దాలకుపైగా వాక్యపరిచర్య, సామాజిక సేవా కార్యక్రమాలను జాన్‌పాల్ తెనాలి కేంద్రంగా నిర్వహిస్తున్నారు. పలు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు నిర్వహిస్తున్నారు. బిషప్ జాన్‌పాల్‌కు డాక్టరేట్ రావడంపై పట్టణ ప్రముఖులు, రాక్ గాస్పెల్ చర్చి సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

విద్యా హక్కు చట్టాన్ని తెలుసుకోవాలి

కొల్లిపర: విద్య హక్కు 2009 చట్టం గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ కె.సాల్మన్ రాజు, కె.ఝాన్సీలత అన్నారు. శనివారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో విద్య హక్కు చట్టం గురించి చట్టంలోనే సెక్షన్ 12/1 సి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సాల్మన్ రాజ్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా సమాజంలో ప్రతికూల పరిస్థితుల ఎదుర్కొంటున్న వర్గాల పిల్లలు బలహీన వర్గాల పిల్లలు ప్రైవేట్ ఎయిడ్స్ పాఠశాలలో ఉచితంగా చదువు కొరకు ఒకటవ తరగతి లోనే ప్రవేశానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మండలంలో అర్హత కలిగిన వారు తమ పిల్లలను ఒకటవ తరగతి చదవబోవు విద్యార్థులను ఈ సంవత్సరం విద్యా సంవత్సరానికి మే 15వ తేదీ లోపు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో 1,20,000 ఆదాయం ఉన్నవారు ఈ చట్టం కింద అర్హులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఆన్లైన్లో నమోదు చేసుకుని ఉండాలని సూచించారు. దీనికి అర్హత పొందిన వారు వారి పిల్లలను ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఉచితంగా అర్హత పొందిన ప్రైవేటు స్కూల్లో చదివించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పిడపర్తి రమేష్ బాబు, వి.మురళి, బి.అలేఖ్య, డి.స్వరూప రాణి, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యాహక్కు గురించి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సల్మాన్‌రాజు

ఆపన్న హస్తంలా సీఎం సహాయనిధి

మంత్రి మనోహర్

తెనాలిటౌన్: పేదలకు ఆపదలో ఆపన్న హస్తంలా ముఖ్యమంత్రి సహాయనిధి దోహదపడుతుందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక బోసురోడ్డులోని జనసేన కార్యాలయంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని 23మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. 23 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.16,52,043లు చెక్కుల రూపంలో అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణానికి చెందిన ఇరువురు పేదలకు మంత్రి మనోహర్ సహకారంతో తోపుడు బండి, ట్రైసైకిల్ పంపిణీ చేశారు.



తోపుడుబండి పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

కిశోరి బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రేపల్లె రూరల్: కిశోరి బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఐసీడీఎస్ రేపల్లె సెక్టార్ సీడీపీఓ సుచిత్ర అన్నారు. పట్టణంలోని స్థానిక సెక్టార్ కార్యాలయంలో శనివారం రేపల్లె, నగరం మండలాలలోని మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీవోలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోరి వికాసంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న వారిని కిశోరి బాలికలుగా గుర్తించనున్నట్లు తెలిపారు. వారి సంరక్షణ కోసం ప్రభుత్వం మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహిస్తుందని వెల్లడించారు. ఇందులో భాగంగా కమిటీగా ఎన్నికైన సభ్యులు కిశోరి బాలికలను గుర్తించి వారికి చదువు ప్రాముఖ్యత, బాల్య వివాహాల నిర్మూలన, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాంచారమ్మ, రజిని, వెంకటరత్నం, శివజ్యోతి, సునీత, మంజుల పాల్గొన్నారు

వలసలు అరికట్టాలి

చింతాయపాలెం(కర్లపాలెం): గిరిజనులలో 18 ఏళ్ల నిండిన వారికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించేందుకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. చింతాయపాలెం, కర్లపాలెం గ్రామాలలోని గిరిజనులకు పనులపై శనివారం ఎంపీడీవో అవగాహన కల్పించారు. గిరిజనులు పనుల కోసం దూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా వారు నివసించే గ్రామంలో పనులు కల్పించాలని ఆదేశించారు. జాబ్‌కార్డులో ఉన్న కూలీలందరికీ పనులను గుర్తించి వారితో చేయించాలని చెప్పారు. గిరిజనులు కూడా స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి చదివించుకోవాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన



తెనాలిటౌన్: పదోవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక చెంచుపేటలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మెమోంటోతో సత్కరించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ నూతలపాటి అంజయ్య పాల్గొని విద్యార్థులను అభినందించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అప్పాజీ, డీన్ బి.తిరుపతి రావు, ప్రిన్సిపల్స్ కె.మాధురి, లక్ష్మీపతి, పద్మవాణి, రాధ, తదితరులు ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



తెనాలిటౌన్: కుమారి సుప్రీయ స్మారక ఉచిత ఆయుర్వేద వైద్య సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక చెంచుపేటలోని వైద్యశాల వద్ద పేదలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఆళ్ళ నాగిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి శిబిరంలో పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొని వైద్యసేవలు పొందారు. డాక్టర్ పి.నాగేంద్రబాబు, డాక్టర్ జి.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ శిరీషా పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 100 మంది పైబడి వైద్యసేవలు పొందినట్లు డాక్టర్ నాగిరెడ్డి తెలియజెప్పారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

